ప్రాసెస్డ్ ఫుడ్‌తో 30కి పైగా రోగాలు!

- అకాల మరణ ముప్పు పెరిగే ప్రమాదం!
- తాజా అధ్యయనం హెచ్చరిక

సిడ్నీ, ఫిబ్రవరి 29: తరచూ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకొంటే క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో పాటు 32 వ్యాధుల బారిన పడే ముప్పు ఉన్నదని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం హెచ్చరించింది. అంతే కాకుండా దీని వల్ల మానసిక అనారోగ్యం, అకాల మరణ ముప్పు కూడా పెరిగే ప్రమాదం ఉన్నదని తెలిపింది. పరిశ్రమల్లో తయారయ్యే అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌లో విటమిన్లు, పీచు తక్కువగా, చక్కెర, ఉప్పు, కొవ్వు ఎక్కువగా ఉంటాయని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఆస్ట్రేలియా, యూఎస్, ఫ్రాన్స్, ఐర్లాండ్ శాస్త్రవేత్తలు తెలిపారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల వల్ల కలిగే మరణ ముప్పు 50 శాతం పెరుగుతుందని సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఈ అధ్యయనంలో కోటి మంది నుంచి వివరాలు సేకరించి విశ్లేషించారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల డిప్రెషన్ పెరిగే అవకాశం 22 శాతం ఎక్కువని తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు అత్యవసరంగా తగిన చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు కోరారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ పాకెట్ల మీద వాటిలో అధిక పరిమాణంలో చక్కెరలు, కొవ్వులు ఉన్నాయని ముద్రించడం; స్కూళ్లు, దవాఖానల దగ్గర అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ప్రచారం, అమ్మకాలు నిషేధించడం; అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ కన్నా ప్రాసెస్ చేయని లేదా తక్కువ ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు తక్కువ ధరలకు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని డియాకిన్ యూనివర్సిటీ రిసెర్చ్ ఫెలో మెలిస్సా ఎమ్ లానే సూచించారు.

చిలీ సముద్ర జలాల్లో 'నడిచే చేప'

శాంటియాగో : చిలీ కోస్తాతీరంలోని సముద్ర జలాల్లో అత్యంత అరుదైన జాతికి చెందిన 'నడిచే చేప' కెమెరా కంటికి చిక్కింది. రెండు కాళ్లు.. రెండు చేతులతో నడుస్తున్న ఈ చేపను సముద్ర పరిశోధకులు గుర్తించారు. అంతర్జాతీయ సైంటిస్టుల బృందం ఒకటి చిలీ కోస్తా తీరం వెంబడి సముద్ర లోతుల్ని అన్వేషిస్తుండగా, 100కుపైగా కొత్త జీవ జాతుల్ని వారు గుర్తించారని 'వాయిస్ ఆఫ్ అమెరికా' తాజాగా తెలిపింది. సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో ఇవి ఆవాసాన్ని ఏర్పరచుకుంటాయి. ఇందులో 'నడిచే చేప'లు కొన్ని దశాబ్దాల కొకమారు మనకు కనిపిస్తుంటాయి. రోబోలను ఉపయోగించి విస్తృతమైన సముద్రతీర భూభాగాన్ని అన్వేషిస్తుండగా వీటిని సైంటిస్టుల బృందం గుర్తించింది. 'నాలుగు కొత్త సముద్ర పర్వతాలను కూడా కనుగొన్నాం' అని ఓషియన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విర్మానీ చెప్పారు.

పండ్ల వాసనతో క్యాన్సర్ దూరం!

వాషింగ్టన్, ఫిబ్రవరి 29: పండ్లు తింటే రోగాలు నయమవుతాయని, దూరమవుతాయని విన్నాం. అంతేకాదు.. పండ్ల వాసన క్యాన్సర్ కణాల వృద్ధిని అడ్డుకోగలదని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. క్యాన్సర్ థెరపీలో వైద్యులు 'హిస్టోన్ డీఎసిటలేస్ ఇన్హిబేటర్' (హెచ్‌డీఏసీ)ను వాడుతారు. క్యాన్సర్ కణాల వృద్ధి, న్యూరోడిజెనరేటివ్ (పార్కిన్సన్, అల్జీమర్స్.. మొదలైనవి) వ్యాధులను అడ్డుకోవటంలో ఇది ఉపయోగపడుతుంది. అయితే బాగా పండిన పండ్ల నుంచి వెలువడే వాసన కూడా హెచ్‌డీఏసీ మాదిరి ప్రభావం చూపుతున్నదని సైంటిస్టుల ప్రయోగాల్లో తేలింది. పండ్ల వాసన పీల్చినప్పుడు జన్యు వ్యక్తీకరణలో మార్పులు ఉన్నాయని, ఇది క్యాన్సర్, నరాల సంబంధిత వైద్య చికిత్సలో సహాయకారిగా మారుతున్నదని సైంటిస్టులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని ప్రయోగాలు జరపాల్సి ఉందని, ఆవిర్లు, వాసనలకు గురిచేయటం వంటి కొత్త విధానాలు క్యాన్సర్ కణాలపై ఏమేరకు ప్రభావం చూపుతాయన్నది తేలాల్సి ఉందని వారు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఎలుకలు, జంతువులపై ప్రయోగాలు చేస్తున్నట్టు తెలిపారు. మనుషుల్లోని వివిధ అవయవాలకు సోకే క్యాన్సర్‌కు సంబంధించి వైద్య చికిత్సలో ఇది కీలకం అవుతుందని అంటున్నారు.

హెచ్1బీ రిజిస్ట్రేషన్‌కు కొత్త విధానం

వాషింగ్టన్: హెచ్1బీ రిజిస్ట్రేషన్స్, పిటిషన్స్‌కి సంబంధించి అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం (యుఎస్‌సీఐఎస్) కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. మైయూఎస్‌సీఐఎస్ పేరిట ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా సంస్థలు, వారి ప్రతినిధులు వీసా దరఖాస్తు ప్రక్రియలో సమర్థంగా భాగస్వామ్యమయ్యేందుకు వీలవుతుంది. 2025 ఆర్థిక సంవత్సరానికి హెచ్1బీ పిటిషన్స్ దాఖలు చేసే సంస్థలు మైయూఎస్‌సీఐఎస్‌లో ఆర్గనైజేషనల్ ఖాతా క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

స్టే ఆర్డర్ ఆటోమెటిక్‌గా రద్దు కాదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సివిల్ లేదా క్రిమినల్ కేసుల్లో కింది కోర్టులు లేదా హైకోర్టులు మంజూరు చేసే స్టే ఉత్తర్వులు ఆరు నెలలు ముగిసిన వెంటనే వాటంతట అవే రద్దు కాబోవని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. రాజ్యాంగ న్యాయస్థానాలు (సుప్రీంకోర్టు, హైకోర్టులు) సాధారణంగా కింది కోర్టుల్లో కేసుల విచారణకు సమయాన్ని నిర్ణయించడానికి దూరంగా ఉండాలని తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. అసాధారణ కేసుల్లో మాత్రమే విచారణను ముగించడానికి గడువును కింది కోర్టులకు ఉన్నత న్యాయస్థానాలు నిర్ణయించవచ్చునని తెలిపింది. కేసుల విచారణకు ప్రాధాన్యమిచ్చే విషయాన్ని ఆ కేసులు ఏ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయో, అదే కోర్టు విచక్షణకు వదిలిపెట్టడం ఉత్తమమని వివరించింది. 2018లో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఓ కేసులో ఇచ్చిన తీర్పును తాజా తీర్పు కొట్టి వేసింది. కింది కోర్టులు లేదా హైకోర్టులు మంజూరు చేసిన స్టే ఉత్తర్వులు, ప్రత్యేకంగా పొడిగించకపోతే, వాటంతట అవే రద్దవుతాయని త్రిసభ్య ధర్మాసనం అప్పట్లో తీర్పు చెప్పింది. స్టే ఆర్డర్ మంజూరైన తర్వాత ఆరు నెలలు ముగిసిన అనంతరం విచారణ లేదా ప్రొసీడింగ్స్ నిలిచిపోబోవని తెలిపింది. అయితే సుప్రీంకోర్టు ఇచ్చే స్టే ఆర్డర్‌కు ఇది వర్తించదని వివరించింది. ఈ తీర్పుతో ఏకీభవించేది లేదని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 78 వేల సబ్సిడీ

75 వేల కోట్లతో సూర్యఘర్ పథకం

కోటి ఇండ్లకు ఉచిత విద్యుత్తు • ఎరువులపై 24 వేల కోట్ల రాయితీ

దేశంలో 3 చిప్ తయారీ యూనిట్లు • కేంద్రమంత్రివర్గం నిర్ణయాలు

క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ 'పీఎం-సూర్యఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'కు కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. కోటి ఇండ్లకు ఉచిత విద్యుత్తు అందించేందుకు అవసరమైన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.75,021 కోట్లతో ఈ పథకం అమలు చేయనున్నారు. పథకంలో భాగంగా కిలోవాట్‌లోపు విద్యుత్తు ఉత్పత్తి చేసే సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్ల యూనిట్‌కు రూ.60 వేలు, మూడు అంతకంటే ఎక్కువ కిలోవాట్ల యూనిట్‌కు రూ.78 వేలు సబ్సిడీ అందజేస్తారు. దీని కోసం నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం కోరింది. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియా సమావేశంలో క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. 2025నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటుచేస్తామని తెలిపారు.

ఎరువులపై రూ.24,220 కోట్ల సబ్సిడీ

ఈ ఖరీఫ్ సీజన్‌కు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై 24,220 కోట్ల సబ్సిడీని ఇస్తున్నట్టు కేంద్ర మంత్రివర్గం ప్రకటించింది. డీఏపీ క్వింటాల్ రూ.1350, పొటాష్ 50 కిలోల బస్తా రూ.1,670, ఎన్‌పీకే బస్తా 1,470 చొప్పున లభిస్తాయని మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై న్యూట్రియంట్ ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) ప్రతిపాదనలను ఆమోదించామన్నారు.

అంతర్జాతీయ పులుల పరిరక్షణ కూటమి

దేశంలోని పులులు, ఇతర పెద్ద జంతువుల పరిరక్షణలో భాగంగా గ్లోబల్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ)ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం గురువారం నిర్ణయించింది. కొన్ని ముఖ్యమైన లోహాల రాయల్టీ శాతాన్ని నిర్ధారించడానికి మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ చట్టం రెండో షెడ్యూల్ సవరణను మంత్రివర్గం ఆమోదించింది. రాయల్టీ రేటు నిర్దేశానికి ఆమోదం లభించడం వల్ల ఈ 12 లోహాలకు సంబంధించిన గనులను మొదటిసారిగా వేలం వేయడానికి ప్రభుత్వానికి వీలు కలుగుతుంది.

రూ.1.26 లక్షల కోట్లతో చిప్ తయారీ యూనిట్లు

దేశీయ అవసరాలకు ఇతర దేశాల ఉత్పత్తుల దిగుమతులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడానికి దేశంలో మూడు సెమీ కండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గుజరాత్, అస్సాంలో వీటిని ఏర్పాటుచేయనున్నారు. రానున్న 100 రోజుల్లో వీటి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కేంద్ర మంత్రి ఠాకూర్ తెలిపారు. తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్ప్‌తో కలిసి టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజరాత్‌లోని దొలేరాలో సెమీకండక్టర్ ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయనుంది. అస్సాంలోని మోరిగావ్‌లో టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మరో యూనిట్‌ను నెలకొల్పనుంది. అలాగే జపాన్‌కు చెందిన రెనెసస్ గ్రూప్, థాయ్‌లాండ్‌కు చెందిన స్టార్స్ మైక్రో ఎలక్ట్రానిక్స్‌తో కలిసి సీజీ పవర్ గుజరాత్‌లోని సనంద్‌లో మరో యూనిట్‌ను ఏర్పాటుచేయనుంది.

ఫాస్టాగ్ కేవైసీ అప్‌డేట్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ఫాస్టాగ్ కేవైసీ అప్‌డేట్‌కు మరో నెల గడువు పొడిగించింది. వాస్తవానికి దీని అప్‌డేట్‌కు ఆఖరి తేదీ గురువారంతో ముగుస్తుంది. అయితే దీనిని ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఫాస్టాగ్ అనేది జాతీయ రహదారులు, ఇతర రోడ్లపై వాహనాల నుంచి టోల్‌టాక్స్ వసూలుకు వినియోగించే ఒక ఎలక్ట్రానిక్ విధానం. ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్ విధానం తెచ్చేందుకు ఇటీవల ప్రభుత్వం ఫాస్టాగ్ కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఇంటెల్ ఇండియా మాజీ చీఫ్ అవతార్ సైనీ దుర్మరణం

ముంబై: ఇంటెల్ ఇండియా మాజీ హెడ్ అవతార్ సైనీ (68) బుధవారం ఉదయం నవీ ముంబైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆయన పెంటియం ప్రాసెసర్ డిజైనింగ్‌కు నేతృత్వం వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అవతార్ మరికొందరు సైకిలిస్ట్‌లతో కలిసి నేరుల్‌లోని పామ్ బీచ్ రోడ్డులో ఉదయం సైక్లింగ్ చేశారు. ఉదయం దాదాపు 5.50 గంటల ప్రాంతంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్యాక్సీ ఆయన సైకిల్‌ను ఢీకొట్టింది. ఆ ట్యాక్సీ డ్రైవర్ తప్పించుకుని, పారిపోయేందుకు ప్రయత్నించడంతో, సైకిల్ ఫ్రేమ్ ఆ కారుకు తగులుకుని, కొంత దూరం లాక్కుని వెళ్లిపోయింది. దానితోపాటు అవతార్‌ను కూడా రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. ఆయన హెల్మెట్ ధరించినప్పటికీ, తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను సమీపంలోని దవాఖానకు తరలించారు. అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు.

ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

హిమాచల్‌ప్రదేశ్ స్పీకర్ నిర్ణయం

విప్ ధిక్కరించినందుకేనని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: హిమాచల్ ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ కుల్దీప్ పఠానియా గురువారం అనర్హత వేటు వేశారు. అయితే ఈ వేటు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు కాదని స్పీకర్ స్పష్టం చేశారు. ఆర్థిక బిల్లుపై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ జారీ చేసిన విప్‌ను ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు ధిక్కరించారని, బడ్జెట్‌పై ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని, వీరిపై అనర్హత వేటు వేయాలని అధికార కాంగ్రెస్ కోరింది. దీంతో ఎమ్మెల్యేలకు స్పీకర్ షోకాజ్ నోటీస్ జారీ చేసి బుధవారం విచారణకు రమ్మని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న స్పీకర్ బుధవారం తీర్పును రిజర్వ్ చేసి గురువారం ప్రకటించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించటం హిమాచల్ ప్రదేశ్ చరిత్రలో ఇదే తొలిసారి.

దోషి నరం దొరక్క మరణ శిక్ష నిలిపివేత

కునా, ఫిబ్రవరి 29: యాభై ఏండ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న జీవిత ఖైదీకి ప్రాణాంతక సూది మందు ఇచ్చి చంపడంలో వైద్య సిబ్బంది విఫలమయ్యారు. శరీరంలో చెడు రక్త ప్రవాహం జరిగే సిరకు సంబంధించిన నరాన్ని కనిపెట్టలేకపోవడమే ఇందుకు కారణం. ఈ కారణంగా అతడి మరణ శిక్షను అమెరికాలోని ఇడాహో రాష్ట్రం తాత్కాలికంగా నిలిపేసింది. మీడియా కథనం ప్రకారం.. క్రీచ్(73) అయిదు గురిని హత్య చేసిన కేసులో దోషి. బుధవారం భారీ భద్రత మధ్య మూడు వైద్య బృందాలు ఎనిమిదిసార్లు ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడానికి అతడి శరీరంలోని వివిధ భాగాలను పరిశీలించారు. సూది మందు ఇవ్వడానికి సరైన నరం దొరక్క చేతులెత్తేశారు. అయితే దోషికి మరణ శిక్ష అమలు చేయడానికి వేరే పద్ధతులను ప్రయత్నిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. దీనిపై క్రీచ్ న్యాయవాది కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం డెత్ వారెంట్ సమయం పూర్తయ్యేలోపు మరణ శిక్ష అమలుకు మరో పద్ధతి అమలు చేయకూడదని స్టే ఇచ్చింది. మరణ శిక్ష అమలుకు మరో వారెంట్ తెచ్చుకోవాలని చెప్పింది.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాల్సిందే!

- పాత పెన్షన్ విధానం అమలుకు పోరాటం
- మే 1 నుంచి దేశ వ్యాప్త సమ్మెకు ఉద్యోగులు రెడీ
- సమ్మెకు సిద్ధంగా 24 లక్షల మంది ఉద్యోగులు
- మార్చి 19న అన్ని జోన్ల జీఎంలకు సమ్మె నోటీసులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం 2004లో తీసుకొచ్చిన కొత్త పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకు దిగనున్నారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రైల్వే ఉద్యోగులతోపాటు పోస్టల్, టెలికం, ఇన్‌కమ్‌టాక్స్, డిఫెన్స్, డీఆర్‌డీవో లాంటి కీలకమైక శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ పాత పెన్షన్ విధానం కోరుతూ జాతీయ స్థాయిలో సమ్మెకు దిగబోతున్నారు. ఈ మేరకు మే 1 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. మార్చి 19న అన్ని ప్రభుత్వ రంగాల, సంస్థల శాఖాధిపతులకు సమ్మె నోటీసులు ఇవ్వబోతున్నట్టు ఎస్‌సీఆర్ ఎంప్లాయిస్ సంఘ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య, భరణి తెలిపారు.

సమ్మెలో 24 లక్షల మంది ఉద్యోగులు

కొత్త పెన్షన్ విధానానికి నిరసనగా కేంద్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో దాదాపు 24 లక్షల మంది పాల్గొననున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ రూపొందించుకున్నారు. అంటే ప్రస్తుతం అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలలో దాదాపు 34 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వారిలో దాదాపు 70 శాతం మంది నూతన పెన్షన్ విధానం పరిధిలోకి వచ్చిన వారే ఉన్నారు. దీంతో ఆ వర్గం మొత్తం సమ్మె బాట పట్టబోతున్నారు. ముఖ్యంగా రైల్వేలు, పోస్టల్, టెలికం, ఐటీ, డిఫెన్స్ వంటి ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులంతా సమ్మెకు పూర్తిగా మద్దతు ఇస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఎస్‌సీఆర్ మజ్దూర్ యూనియన్‌తో పాటు ఎస్‌సీఆర్ ఎంప్లాయిస్ సంఘ్, వాటికి అనుబంధంగా ఉన్న పలు సంఘాల సభ్యులు కూడా పాత పెన్షన్ విధానాన్ని కోరుకుంటూ సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నారు.

బిల్‌గేట్స్‌కు 'కిస్' మానవతా పురస్కారం

న్యూయార్క్: వివిధ రంగాలలో చేపట్టిన దాతృత్వ కార్యక్రమాలకు ప్రముఖ దాత, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌కు ప్రతిష్ఠాత్మకమైన కేఐఎస్ఎస్ (కిస్) మానవతా అవార్డు-2023ను ప్రదానం చేశారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వాతావరణ మార్పు రంగాలలో చేపట్టిన కార్యక్రమాలలో భాగస్వామి అయ్యి అసమానతలను తగ్గించడానికి బిల్‌గేట్స్ చేస్తున్న కృషికి ఈ అవార్డు అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తనకు అవార్డు ప్రదానం చేయడం పట్ల బిల్‌గేట్స్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన లింగ సమానత్వంపై ప్రసంగించారు. 2008లో ప్రొఫెసర్ అచ్యుత సమంత ప్రవేశపెట్టిన ఈ కిస్ మానవత్వ అవార్డును ప్రపంచ వ్యాప్తంగా మానవసేవకు విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు ప్రదానం చేస్తున్నారు.



భారత్‌లో 13,874 చిరుతలు

దేశంలో చిరుతల సంఖ్య(అంచనా) పెరిగింది. 2018లో దేశ వ్యాప్తంగా 12,852 చిరుతలుండగా 2022 నాటి ఆ సంఖ్య 13,874కు చేరుకున్నది. అయితే శివాంక్ కొండలు, గంగా, బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతాల్లో మాత్రం చిరుతల సంఖ్య తగ్గింది. కేంద్ర పర్యావరణ శాఖ గురువారం విడుదల చేసిన 'భారత్‌లో చిరుతల స్థితి' నివేదికలో ఈ విషయాలను వెల్లడించారు.



అత్యధిక చిరుతలున్న టైగర్ రిజర్వ్‌లు

- నాగార్జునసాగర్ శ్రీశైలం- ఏపీ
- పన్నా- మధ్యప్రదేశ్
- సాత్పూరా-మధ్యప్రదేశ్

నాలుగేండ్లకు ఒకసారి వెలువడే పత్రిక!

పారిస్ :దిన పత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు, ఇయర్లీ మ్యాగజైన్లు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి. కానీ ఫ్రాన్స్‌లో 'లా బొగీ డు సప్పర్' అనే వ్యంగ్యాస్త్రాలు విసిరే వార్తా పత్రిక నాలుగేండ్ల కోసారి మాత్రమే వెలువడుతున్నది. ప్రతి లీప్ ఇయర్ సంవత్సరంలో దాన్ని ప్రచురిస్తుంటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29 రావటంతో.. బుధవారం ఫ్రాన్స్ వాసులు ఈ పత్రికను అందుకున్నారు. రోజువారీ జీవితంలో జరిగే విచిత్రాలపై సెటైర్లను ఇందులో ప్రచురిస్తారు. ఇది కేవలం వినోదం కోసం మాత్రమే అని చెప్పే నిర్వాహకులు మొదటిసారిగా దీన్ని 1980లో ప్రారంభించారు.

కొత్త పార్లమెంటు ఓ ఫైవ్ స్టార్ జైలు:రౌత్

న్యూఢిల్లీ: శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కొత్త పార్లమెంటు భవనంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, న్యూఢిల్లీలోని సెంట్రల్ విస్టా పరిస్థితిని చూడాలన్నారు. నూతన పార్లమెంటు భవనం ఓ ఫైవ్ స్టార్ జైలులా ఉందని, దీనిలో పని చేయడం సాధ్యం కాదని, సత్ఫలితాలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే, చరిత్రాత్మక పాత పార్లమెంటు భవనంలోనే పార్లమెంటు సమావేశాలను తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

గూగుల్‌పై 18,850 కోట్లకు దావా

- అడ్వర్టైజింగ్ మార్కెట్‌లో పోటీని అణచివేస్తున్నది
- సెర్చ్ ఇంజిన్ దిగ్గజంపై 32 మీడియా గ్రూపుల ఆరోపణ

కొచ్చి, ఫిబ్రవరి 29: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్‌పై 32 మీడియా గ్రూపులు 2.1 బిలియన్ యూరోల (రూ.18,857 కోట్ల)కు దావా వేశాయి. గూగుల్ డిజిటల్ అడ్వర్టైజింగ్ విధానాల వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఆ గ్రూపులు ఆరోపించాయి. వాటిలో ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, హంగరీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, నార్వే, పోలెండ్, స్పెయిన్, స్వీడన్ తదితర దేశాలకు చెందిన ప్రచురణా సంస్థలు ఉన్నాయి. గూగుల్ తన ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేస్తూ అనైతిక విధానాలకు పాల్పడుతున్నదని, దీంతో మార్కెట్‌లో పోటీ తగ్గి తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని ఆ కంపెనీలు పేర్కొన్నాయి. గూగుల్ అనైతిక విధానాలకు పాల్పడకపోతే అడ్వర్టైజింగ్ ద్వారా తమ రాబడులు గణనీయంగా పెరిగేవని, ఆ నిధులను తిరిగి యూరోపియన్ మీడియా రంగం బలోపేతానికి వెచ్చించేందుకు వీలయ్యేదని వివరించాయి. కాగా, యాపిల్, మొజిల్లా లాంటి కంపెనీలకు చెల్లింపులు జరిపి గూగుల్ తన సెర్చింజన్‌ను డిఫాల్ట్ సెర్చింజన్‌గా ఉంచడం ద్వారా మార్కెట్‌లో పోటీని అణిచివేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో యాంటీట్రస్ట్ రెగ్యులేటర్లు ఇప్పటికే గూగుల్‌పై దృష్టి సారించారు.

ఇజ్రాయెల్ దాడిలో 100 మందికిపైగా మృతి

గాజాలో 30 వేలు దాటిన మరణాలు

రఫా : గాజా నగరంపై గురువారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న 100 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా, 740 మంది గాయపడ్డారు. యుద్ధం కారణంగా గాజాలో ఇప్పటి వరకు 30 వేల మందికి పైగా మరణించినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీరిలో మూడొంతుల మంది మహిళలు, చిన్నారులే. గాజా, ఉత్తర గాజాలో బాధితులకు సహాయం కూడా అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గాజాలో 23 లక్షల మంది పాలస్తీనియన్లు ఆకలితో అలమటిస్తున్నారని, 80 శాతం మంది ఇళ్లను వదిలి వెళ్లిపోయారని ఐరాస ప్రకటించింది.

ఉక్రెయిన్‌కు బలగాలను పంపితే.. అణుయుద్ధం తప్పదు

పాశ్చాత్య దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక



మాస్కో, ఫిబ్రవరి 29: ఉక్రెయిన్‌కు మద్దతుగా యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొంటే తీవ్ర పరిణామాలుంటాయని పాశ్చాత్య దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోమారు హెచ్చరికలు జారీచేశారు. తమ సైనిక బలగాలను ఉక్రెయిన్‌కు పంపితే అణుయు